క్లుప్తంగా

కులగణన వేగవంతం చేయాలి

ఎంపీడీవో శంకర్‌రావు



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలోని సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, వలంటీర్లు అంకిత భావంతో విధులు నిర్వహించి కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే గ్రామాలలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి చేపట్టాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 90 శాతం కులగణన పూర్తయిందన్నారు. వలంటీర్లు సర్వే ప్రారంభం నుంచి ముగింపు వరకు ఒకే సెల్‌ఫోన్ వినియోగించాలన్నారు. ఈ సర్వేలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లిన సమయంలో 20కి పైగా అంశాలపై సమాచారం సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు క్రాస్‌చెక్ చేసుకోవాలని తప్పులు ఏమైనా ఉంటే రిజెక్ట్ చేయాలని సూచించారు. సర్వేలో భాగంగా కుటుంబాల నుంచి వివరాలు సేకరించేటప్పుడు, సర్వే పూర్తి అయిన తరువాత ఎవరూ స్క్రీన్‌షాట్ తీయకుండా (చోరిచేయకుండా)యాప్‌లో డిజైన్ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 24 తేదీ నాటికి గ్రామాలలో జరుగుతున్న కులగణన సర్వేను 100 శాతం పూర్తి చేయాలని సూచించారు.

విద్య బాలల హక్కుగా గుర్తించాలి



మాచవరం: విద్య బాలల హక్కుగా గుర్తించి బాలికల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని ఐసీడీసీ సీడీపీవో జె.శ్రీవల్లి అన్నారు. మండలంలోని పిల్లుట్ల, చెన్నాయపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని బేటి బచావో-బేటీ పఢావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ బాలికల పట్ల వివక్ష తగదన్నారు. బాలిక లు విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలన్నా రు. లింగ వివక్ష, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమాల్లో సెక్టా ర్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అన్నపూర్ణ, కోటేశ్వరి, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ కా ర్యకర్తలు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



గురజాల : వలంటీర్లు చేస్తున్న సేవలు అమోఘమని వైస్ ఎంపీపీ వేముల శేషమ్మచలమయ్య అన్నారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు ఇంటి వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా 1వ తేదీన పింఛన్‌లు అందిస్తుండటంతో వృద్ధులు, వికలాంగులు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లను సత్కరించి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, సర్పంచ్ బత్తుల ప్రసాద్, సెక్రటరీ శివకోటేశ్వరరావు, జమ్మిగుంపుల నాగేశ్వరరావు, దేవరశెట్టి మణిదీప్, కాస అనిల్ తదితరులున్నారు.

ఆరోగ్య శ్రీ కార్డులు అందజేత



16వ వార్డులో ఆరోగ్యశ్రీ కార్డులు అందుకున్న వారు

పిడుగురాళ్ల : పట్టణంలోని 6వ సచివాలయం పరిధిలోని 16వ వార్డులో మంగళవారం ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి కార్డులను అందించారు. ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచడంతో నూతన కార్డులు మంజూరు చేయడం జరిగిందని కౌన్సిలర్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, రవి, పిచ్చయ్య, నాగిరెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ల సేవలు హర్షణీయం

- ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను ప్రజలకు వివరించండి
- నాటి జన్మభూమి కమిటీలకు.. నేటి వలంటరీ వ్యవస్థకు తేడా గమనించండి
- ప్రభుత్వ విప్ పీఆర్కే



వలంటీర్లకు వందనంలో ప్రభుత్వ విప్ పీఆర్కే, ప్రజా ప్రతినిధులు, నాయకులు



వలంటీర్లకు అవార్డుల ప్రదానంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి , తదితరులు

దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక సమానులైన వలంటీర్లు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ వలంటీర్ల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఎంపీపీ ఏచూరి సాయి శంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తూ వారి మన్ననలను పొందుతున్నారన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇదే విధంగా పనిచేసి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించాలన్నారు. సేవావజ్రకు ఎంపికైన ఆత్మకూరు సచివాలయ వలంటీర్ బి.వేణుగోపాలాచారికి రూ.45వేల నగదు, ప్రశంసాపత్రం అందించారు. ఎస్.రామరాజు, కె.కుమారి, వై.పూర్ణిమ, వై.కోటేశ్వరరావు, వి.శేషుబాబులకు సేవారత్న అవార్డు, రూ.30వేల నగదు, ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా, ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ ఏసాయి శంకర్, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కటకం చిన వెంకటయ్య, నాలి రామయ్య, మద్దికర ఆదిరెడ్డి, కపలవాయి సూర్యనారాయణ, చెన్నుపాటి సీతారామయ్య, గౌరెడ్డి వెంకటరెడ్డి, కటకం గోపాల్, కపలవాయి శ్రీను, వెంకటప్పయ్య, పసుపులేటి వెంకట్రామయ్య, జంగా కొండలు, మాదాసు వాసు, కట్టబోయిన రవి, జంగా యలమంద, కొల్లి హను మయ్య, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ డైరెక్టర్లు, నాయకులు, వలంటీర్లు తదితరులున్నారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

నలభై సంవత్సరాల ఇండస్ట్రీ అని చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి శూన్యమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి కేవలం వారి పార్టీ నాయకులకు ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తొలిరోజు నుంచి పేద ప్రజల అభివృద్ధి కోసం తాను ప్రకటించిన మేనిఫెస్టోను తూచా తప్పకుండా 100 శాతం హామీలను నెరవేర్చి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఏ గ్రామంలో, పట్టణంలో చూసినా ప్రభుత్వం నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తున్నాయని, స్థానిక ప్రజలకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారని తెలిపారు. ఇవి పచ్చ మీడియాకు, స్థానిక నాయకులకు కనిపించటం లేదా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు వారి హయాంలో చేసిన నాలుగు మంచి పనులను ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, సొసైటీ చైర్మన్ కటకం రామారావు, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిన నరసింహారావు, నాగేశ్వరరావు, మాణిక్యం, కోటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు విశేష సేవలందించేందుకే వలంటీర్ల వ్యవస్థ

కారెంపూడి: ప్రజలకు సత్వర సేవలందించాలని జగనన్న రూపకల్పన చేసిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలపై చంద్రబాబు నాయుడు ద్వేషం పెంచుకున్నారని ప్రజలకు మంచి చేస్తున్న వ్యవస్థలపై ద్వేషం ఉన్న వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. కారెంపూడిలో మంగళవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను త్వరితగతిన నెరవేర్చడం కోసం గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు రూపకల్పన చేసి 1.30 లక్షల మంది సచివాలయ ఉద్యోగులను, 2.40 లక్షల మంది వలంటీర్లను నియమించడం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ప్రజలకు తక్షణ సేవలు, ప్రభుత్వ పథకాలు నేరుగా పారదర్శకంగా అందే విధంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రతి నెల ఒకటో తారీఖు పింఛన్ ఇళ్ల వద్దే అందిస్తుండడంతో పాటు సంక్షేమ పథకాల సేవలను కూడా గడప వద్దే అందించే ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి పింఛన్ తీసుకోడానికి అవ్వాతాతలు పడుతున్న ఇబ్బందిని కూడా తొలగించలేకపోయారన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడుతున్నాయని అందరూ గుర్తించారన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్ అంటే జగనన్నకు ప్రేమన్నారు. ప్రతి ఏటా వారిని పురస్కారాలతో గౌరవించుకోవడం జరుగుతోందన్నారు. కారెంపూడి మండలంలోని మిరియాల గ్రామానికి చెందిన మేకల శివయ్యను సేవావజ్ర అవార్డుతో సన్మానించారు. అదే విధంగా అవార్డు పొందిన కాలె పుల్లారావు, షేక్ సారాబి, దేవరశెట్టి సాంబశివరావు, ఇరికెదిండ్ల మరియమ్మ, గుబిలి నాగజ్యోతిలకు సేవారత్న, అలాగే 256 మందికి సేవామిత్ర అవార్డులు అందించారు. ఆయా గ్రామాల వలంటీర్లను ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకుల చేతుల మీదగా పీఆర్కే సన్మానింపజేశారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, ఎంపీపీ సావిత్రిఅల్లయ్య, జెడ్పీటీసీ షఫీ, మాజీ ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అక్బర్, కొంగర సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ చినవెంకటనర్సయ్య, ఎర్రగురవారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, చంద్రశేఖర్, సర్పంచ్ ప్రమీలాభాయితేజానాయక్, అంజిరెడ్డి, రామారావు, వెంకటేశ్వరరెడ్డి, ఏసోబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు.

భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు



విజయపురిసౌత్: భీష్మ ఏకాదశి వేడుకలను విజయపురిసౌత్‌లోని సీతారామాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రపన్న గోష్ఠి సభ్యుల చేత విష్ణు సహస్ర నామ పారాయణం జరిగింది. తీర్థప్రసాదాలు అందజేశారు. భీష్మ ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

శిశు హత్యలు మహానేరం



పిడుగురాళ్ల రూరల్: శిశు హత్యలు మహానేరమని, అలాంటి వాటికి పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఐసీడీసీ సూపర్‌వైజర్ అంజలికుమారి అన్నారు. మండలంలోని కరాలపాడు జెడ్పీ హైస్కూల్‌లో బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు విద్యలో ఉన్నతంగా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, లింగ వివక్ష, మానసిక, శారీరక అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 30 కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

విజయపురిసౌత్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీద, తన మీద నమ్మకంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్ కల్పిస్తామని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మాచర్ల మండలం ఏడోమైలు(వీరాంజనేయ పురం) గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి పీఆర్కే సమక్షంలో మాచర్ల పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించానన్నారు. జగనన్న సారథ్యంలో రాష్ట్రంలో సుభిక్ష పాలన కొనసాగుతుందన్నారు. రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలో 175కు 175 అసెంబ్లీ సీట్లు రావటం ఖాయమన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొర్రా బాలునాయక్, అజ్మీరా రనిజానాయక్, కరంటోత్ బాలనాయక్, కరంటోత్ నీలానాయక్, కరంటోత్ భీమానాయక్, అజ్మీరా వీరానాయక్, కొర్రా సేవానాయక్, కొర్రా బాబునాయక్, కొర్రా దట్టానాయక్, కొర్రా మునీనాయక్, కొర్రా వెంకటేష్ నాయక్ ఉన్నారు. కార్యక్రమంలో మాచర్ల మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు, కొప్పునూరు సర్పంచ్ నోముల కృష్ణ, పార్టీ నాయకులు ఎల్లాల బ్రహ్మయ్య యాదవ్, చౌడయ్య, రమావత్ శ్రీనునాయక్, మాంగ్యానాయక్, షేక్ కాశయ్య, మౌలాలి, పి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయండి



విజయపురిసౌత్: విజయపురిసౌత్ టీ జంక్షన్ వద్ద వెంటనే బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్కు కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైవే నిర్మాణంలో రోడ్డు విస్తరణ పనులు జరగడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం కూర్చునేందుకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. నిత్యం వందలాది మంది ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు వెళ్తుంటారని చెప్పారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్ షెల్టర్, నీటి వసతిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మంచికల్లులో పోలీస్ పికెట్ ఏర్పాటు



రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామంలో ఈ నెల 18న వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నాయకులు మూకుమ్మడి దాడి చేసిన నేపథ్యంలో మంగళవారం పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పికెట్(బందోబస్తు) నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న కారణంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గొడవల వలన కుటుంబాలు ఇబ్బందులు పడతాయని గుర్తు పెట్టుకోవాలన్నారు. గ్రామస్తులందరూ పోలీసులకు సహకరించి గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు ముందుకు రావాలన్నారు. ఇతరుల పట్ల దురుసుగా మాట్లాడి రెచ్చగొట్టి ఘర్షణలకు పాల్పడితే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతందని ఎస్ఐ హెచ్చరించారు.

నాణ్యమైన విద్యుత్‌ని అందిస్తున్నాం

- తంగెడలో ఎత్తిపోతల పథకం నిర్మిస్తాం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



తంగెడలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగెడలో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.1.20 కోట్లతో నిర్మించిన విద్యుత్ లైన్స్‌ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 'లో ఓల్టేజి' సమస్యను పరిష్కరించి నాణ్యమైన కరెంట్‌ను ఇచ్చేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా తంగెడ, ముత్యాలంపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు గ్రామాల పరిధిలోని 4 వేల గృహాలకు, వెయ్యికిపైగా వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని, భవిష్యత్‌లో కరెంట్ కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు.

ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు..

తంగెడ గ్రామ సమీపంలోని కృష్ణానది వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. సుమారు రూ.120 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ ఎత్తిపోతలకు అన్ని అనుమతులతో త్వరలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎత్తిపోతల నిర్మాణంతో దాచేపల్లి, ముత్యాలంపాడు, తంగెడ, మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు, చెన్నాయపాలెం, రేగులగడ్డ, వేమవరం, మాచవరం, పిన్నెల్లి గ్రామాల్లోని భూములకు పుష్కలంగా సాగు నీరు అందుతుందని వెల్లడించారు.

వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం..

నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో నూతనంగా రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కాసు ప్రారంభించారు. గతంలో దాచేపల్లి పట్టణంతో పాటు గ్రామాలకూ ఒక్కటే హాస్పిటల్ ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు ఆరోగ్య కేంద్రాలను నిర్మించి సిబ్బందిని కూడా ఏర్పాటు చేశామని, గామాలపాడులో మరో పీహెచ్‌సీ నిర్మాణం త్వరలో చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ సాంబయ్య, మాజీ చైర్మన్ పున్నారావు, వైస్ ఎంపీపీ జాను, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెదహనిమిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేష్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కృష్ణ, సుభానీ, సొసైటీ అధ్యక్షుడు లింగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, యువజన విభాగం మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు కాశయ్య, నాగరాజు, ఎంపీటీసీ ప్రసన్నకుమార్, కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్, నాయకులు మల్లారెడ్డి, వీరాస్వామి, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలలోనే ఉన్నత వైద్య సేవలు



పేర్లు నమోదు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది




మందులు అందజేస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో శంకర్‌రావు, సర్పంచ్ చంద్రారెడ్డి

కారెంపూడి: పేదలకు వారి స్వగ్రామాలలోనే మంచి డాక్టర్లచే ఉన్నత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీపీ సావిత్రిఅల్లయ్య, జెడ్పీటీసీ షఫీ పేర్కొన్నారు. మండలంలోని చిన కొదమగుండ్ల గ్రామ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గాదెవారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.విజయానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ జెడ్డా కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి వీరారెడ్డి ప్రారంభించారు. ఆరోగ్య శిబిరానికి వచ్చిన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు పంపిణీ చేసి, వారికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కార్డులలో ఫలితాలు నమోదు చేసి సంబంధిత డాక్టర్ల వద్దకు పంపారు. 410 మందికి శిబిరంలో వైద్య సేవలందించారు. డాక్టర్ విజయానాయక్, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కేవీ చక్రవర్తి, ఎండీ జనరల్ డాక్టర్ బి.సత్యసాయి హర్షిత్, డాక్టర్ ఎం.లక్ష్మణరెడ్డి రోగులను పరీక్షించి మందులు రాశారు. అలాగే ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.ప్రసాద్‌నాయక్, సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి 60 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న 90 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పరిశుద్ధం, శివపార్వతి, మల్లేశ్వరి, రమణ, సుజాత, సావిత్రి, వెంకటలక్ష్మి, ఏసమ్మ, మేరి, జానిబేగం, దుర్గ, రూతమ్మ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు సేవలందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష..పేదలకు రక్ష

రెంటచింతల: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి పేద కుటుంబానికి ఒక రక్ష అని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని మంచికల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతందన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటిని జల్లెడపట్టి వైద్య సహాయం అవసరమైన వారికి విలేజ్ క్లినిక్ ద్వారా అందించడం జరుగుతందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వైద్యం అందించే కార్యక్రమం దేశంలో ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. 219 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేసినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె.ప్రదీప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్లపాటి చంద్రారెడ్డి, ఎంపీడీవో శంకర్‌రావు, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేత



పిడుగురాళ్ల : పట్టణంలోని 14వ సచివాలయం పరిధిలో చెరువు కట్ట బజారుకు చెందిన దాసరి రాజ్యలక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం అందించారు. రాజ్యలక్ష్మి భర్త దాసరి వెంకటేశ్వర్లు ఇటీవల ప్రమాదంలో మృతి చెందడంతో రూ.3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరయింది. ఈ చెక్కును 27వ వార్డు కౌన్సిలర్ తురకా ముక్కంటి చేతులమీదుగా మృతుడి భార్య రాజ్యలక్ష్మికి అందించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గారపాడులో ఆధ్యాత్మిక శోభ



నిత్య హోమంలో భక్తులు

పెదకూరపాడు: మండలంలోని గారపాడు గ్రామంలో గత రెండు రోజులుగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సంప్రదాయ పీఠం నిర్వాహకులు డాక్టర్ శ్రీపతి బాలకృష్ణమాచార్యుల శిష్య బృందం నిత్య హోమాలు నిర్వహిస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. గ్రామస్తులు, దాతలు సహాయ సహకారాలతో ప్రసన్నాంజనేస్వామి పునః ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఉదయం 9.35 నిమిషాలకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గత నెల 18 నుంచి గ్రామంలో నిత్య హోమాలు నిర్వహిస్తున్నారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కంకణాల శివాజి మాట్లాడుతూ ఏంతో నిష్ఠతో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

నకరికల్లు: చాగల్లు గ్రామానికి చెందిన అంబటి వెంకట రాజేశ్వరి(28) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పి.రాంబాబు మంగళవారం తెలిపారు. మృతురాలి తండ్రి పుట్ట వీరమోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సంతమాగులూరు మండలం పరిటాలవారి పాలేనికి చెందిన వెంకట రాజేశ్వరికి చాగల్లుకు చెందిన అంబటి రామకృష్ణతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కొన్నాళ్లుగా మృతురాలికి తన భర్త, అత్త, మరిది, ఆడబిడ్డల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆమె సోమవారం అర్ధరాత్రి గ్రామంలోని పొలాల్లో గల బిక్షాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కరాలపాడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి తదితరులు

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని అన్ని పోలింగ్ బూతుల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి రమణాకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని కరాలపాడు, బ్రాహ్మణపల్లి, తుమ్మలచెరువు తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 304 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల నిమిత్తం పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతకు సంబంధించిన వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని తెలియజేశారు.